# మనిషి



వేకువజాము చలిగాలి రివ్వుమని వీస్తోంది. తమ కర్తవ్యాన్ని మరిచిపోలేదన్నట్టుగా కోళ్ళు కూస్తున్నాయి. పిచ్చికుక్కో కాలొ ఊరికే అరుస్తోంది. గూడెం అంతా ఇంకా నిద్రమత్తులో నుండి మేలుకోలేదు. పంచాయతీవోర్డువాళ్ళ కిరసనాయిలుదీపం గుడ్డిగా వెలుగుతూంది. జనసంచారం బొత్తిగాలేని ఆ వంకర టింకరబాటలో, వరాలు ఒంటరిగా నడిచి వెళుతూంది. వరాలునుచూచి ఓగుతున్న కుక్క నిలుపులేకుండా మొరగసాగింది. వడివడిగా అడుగులువేస్తూ వెళుతున్న వరాలు, కుక్క అలా మొరగడంచేత దీపస్తంభం దగ్గిర తక్కున ఆగిపోయింది.

వరాలు ఆగడంతో కుక్కకూడా మొరగడం ఆపేసింది. కాని, తిరిగి వరాలు రెండడుగులు వేసిందో లేదో, కుక్క భౌయ్యిమంటూ అరవసాగింది. వరాలు ఆగి, వెనక్కు తిరిగి కుక్కవేపు అసహ్యంగా,కోపంగా చూసింది.

కుక్క మొరుగుతూనే ఉంది.

వరాలుకు విసుగు వచ్చింది.

ఏడుపూ వచ్చినంత పనిఅయింది.

కాస్సేపు నిస్సహాయంగా, దీనంగా కుక్కవేపు చూచింది.

# మనిషి

**మనిషి వస్తుతః క్రూరుడు అంటే వలువురు అంగీకరించక పోవచ్చు. ప్రపంచం పుట్టి ఇంతకాలమైనా మనిషి స్వభావంలో గొప్ప మార్పు రాలేదని చెప్పడానికి నిదర్శనం కావచ్చు—క్రౌర్యం ఇంకా గూడుకట్టుకొనే ఉంది. కనకనే ఎంత చంపుకొన్నా క్రౌర్యం ఇంకా తలఎత్తుతూనే ఉంటుంది.**

ఏమిచేసేందుకూ తోచలేదు. చేతిలో తుపాకీ ఉంటే దాన్ని కాల్చిపారవేసి ఉండేది!

లేకుంటే, దానికి తన భాష అర్థమయ్యేపక్షంలో పరువు తియ్యవద్దని కాళ్ళుపట్టుకుని ఉండేది!

కుక్క హఠాత్తుగా మొరగడం మానేసింది. ఒహుశా కళ్లతో మూగగా చేసుకున్న వరాలు ప్రార్థన అర్థంచేసుకుందేమో?

వరాలు ఏదో బరువు తొలగిపోయినట్లు నిట్టూర్చి, త్వరత్వరగా ముందుకు సాగింది. కాస్సేపటికి గూడెం చివర ఉన్న పాక దగ్గర ఆగి, చుట్టూ ఒకసారి కలయ చూసింది.

అస్తమించబోతున్న కృష్ణపక్ష చంద్రుని వెన్నెల వెలుగులో నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రాంతాన్ని దూరాక మరొకసారి తేలికగా శ్వాస తీసుకుని, తలుపుమీద మెల్లిగా తట్టింది. జవాబులేదు. మరో రెండుసార్లు చేసిన ప్రయత్నం వ్యర్థమే అయింది.

చివరి ప్రయత్నంగా తలుపుమీద దబదబా బాదింది.

కొన్ని క్షణాల తరవాత విసురుగా తలుపు తీసుకుని వచ్చిన వ్యక్తి చికాగ్గా కళ్ళు నులుపుకుంటూ, "ఎవ రది?" అన్నాడు. ఆ కంఠధ్వనిలోని కర్కశత్వానికి వరాలు నిలువెల్లా వణికిపోయింది.

జవాబు చెప్పాలనుకుందిగాని, గొంతు పెగుల్చుకుని మాట రాలేదు.

"ఎవరంటే జవాబుచెప్పక అలా మొద్దులా నిలు చుంటావేం?" ఉరిమినట్లే అన్నాడు. దానితో తన పాదాల కింద భూమి కదులుతున్నట్లే అనిపించింది వరాలుకు. జారిపోతున్న దుప్పటిని ముఖానికి నిండుగా కప్పుకుంది.

నిద్రాభంగం అయినందుకే కోపంతో రేగిపోతున్న అతను వరాలు వకావానికి మరింత కోపంతో ఊగి పోయాడు.

వరాలు రెక్కపట్టుకుని విసురుగా లోపలికిలాగాడు. ఆ లాగడంతో ఆమె కప్పుకుని ఉన్న దుప్పటి కింద పడిపోయింది. లాంతరు వెలుగులో వరాలు ముఖాన్ని చూచిన అతను ఆశ్చర్యపోతూ, "నువ్వా!" అన్నాడు.

వరాలు నెమ్మదిగా తన కనురెప్పలు పైకెత్తి అతని ముఖం ఒక్క క్షణం చూచింది, తిరిగి కళ్ళు దించుకుంది అదే తన జవాబన్నట్లు.

అతని ముఖంలో ఏదో పైశాచికమైన ఆనందం నృత్యం చెయ్యసాగింది.

"చాలా రోజులకు దయ చూపించావే!" అన్నాడు వరాలు కళ్లలోకి వాంఛాపూరితమైన దృక్కులను పారించి.

వరాలు బరువుగా నవ్వింది.

అతను మత్తుగా చూశాడు వరాలువైపు. రేగిన జుట్టు. చిరిగిపోయిన బట్టలు. ఎర్రబడిన కళ్ళు. వాడి పోయిన ముఖం.

"ఏమిటీ అవతారం? అయినా, మా బాగున్నావులే!" వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

వరాలు అతనికి వినిపించనంతటి నెమ్మదిగా నిశ్వసించింది.

అతని చూపులూ, మాటలూ ఆమె హృదయాన్ని సూదులతో పొడిచినట్లే ఉన్నాయి.

అతని ఎదుట నిలుచోవడం, ముంటల్లో నిల్చున్నట్లు అనిపించింది.

"ఏమిటి సంగతి?" ఆపేరకంగా చూస్తూ అన్నాడు. వరాలు బాష్పపూరిత నయనాలతో అతనివైపు చూడసాగింది. కానీ, ఆమె కన్నుల్లో బరువుగా కదిలే భావాలు చదివే శక్తి అప్పట్లో అతనికి లేదు.

"అలా కూర్చో. ఎంతసేపు అలా నిలుచుంటావు?" తను అంతవరకూ పడుకుని ఉన్న మంచంవైపు చూపుతూ అన్నాడు.

వరాలు ఒళ్ళు జలదరించింది. హృదయం బాధతో మెలికలు తిరిగిపోయింది.

కళ్లనుండి రాలిపడబోతున్న కన్నీరు బలవంతంగా ఆపుకుంటూ, "పోవాలి" అంది.

"ఓస్! పోదువుగానిలే! పోడానికేమిటి వచ్చింది?" మొరటుగాఉన్న కంఠంలోనికి మృదుత్వం తెచ్చుకొనేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాడు.

"కాదు."

"మరి?" నవ్వాడు.

కోరమీసాల చాటున దాగివున్న పెదవుల చివరల నుండి తొంగిచూస్తున్న నవ్వు చూచిన వరాలు గుండెలు గుభిల్లుమన్నాయి. మరుక్షణంలో మనస్సు పరిహసించి, నవ్వింది.

"రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరిస్తే ఎట్లా?" అంది మనస్సు.

"నిజమే." ఒప్పుకుంది వరాలు.

"ఏమిటే ఆలోచన, వరాలూ? ఇంతకంటే మంచి సమయం నీకు దొరకలేదేమిటే?" కళ్లు ఎగరేస్తూ అన్నాడు.

"ఇప్పుడు రాకతప్పలేదు." ఒక్కొక్క మాటలోనూ గుండెలోని బాధ నింపిఅంది.

కళ్లనుండి బొటబొటా నీళ్లు రాలాయి.

"ఎందుకా ఏడుపు? ఏం కావాలో చెప్పు." వరాలు దగ్గరగా వెళ్లి ఆమె చెయ్యి తనచేతిలోకి తీసుకుంటూ అనునయంగా అన్నాడు.

అతని చెయ్యి తగలగానే ఆమె శరీరం కుంచించుకు పోయింది. మనస్సంతా ఏహ్యభావంతో నిండిపోయింది. అతని చేతిలోఉన్న తన చేతిని బలంగా వెనక్కు లాక్కోవా లనిపించింది.

అతని దుస్సాహసానికి చెంపమీద ఒక్కటి ఇవ్వాలని అనిపించింది.

కానీ, ఏదీ చెయ్యలేదు. ఏదీ చెయ్యలేకపోయింది. ఏదీ చెయ్యలేని అలాంటి స్థితిలో తనను పెట్టినందుకు భగవంతుణ్ణే తిట్టింది. అలాంటి పాపిష్టి జన్మ ఎత్తినందుకు తన్ను తిట్టుకుంది. కాస్సేపటికి తన్ను తాను సంబాళించుకుంది. చెంపలమీదుగా జారిన కన్నీటిని తుడుచుకుంది. పెదవులమీద మధుర మందస్మితాన్ని తెచ్చుకుంది. మాటల్లో మధువులొలికినట్లు మాధుర్యాన్ని నింపి, "రంగయ్యమావా!" అంది.

"ఏమిటే, వరాలూ? చెప్పు. సందేహమెందుకూ?" అన్నాడు వరాలు చెయ్యి బలంగా నొక్కుతూ.

"డబ్బు కావాలి" అంది, అందమైన కళ్లనుండి తెచ్చిపెట్టుకున్న ఆప్యాయత చిలకరిస్తూ.

ఆ కళ్ల అందాలకు ముగ్ధుడైపోయాడు.

"ఎంతేమిటి?" ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి మెత్తగా నవ్వుతూ అడిగాడు.

కాలసర్పమే తనను చుట్టుకున్నట్లనిపించింది వరాలుకు. అది కాటువెయ్యక మానదనుకుంది. అందుకనే సుతారంగా నవ్వుతూ, "ఏభై" అంది.

"ఎందుకేమిటి?" వరాలును గుండెలకు దగ్గరగా లాక్కుంటూ యథాలాపంగా అడిగాడు.

"అమ్మకు సానా బాగాలేదు. మందులు కొనాల" అంది పెల్లుబుకుతున్న దుఃఖాన్ని గుటుక్కున మింగి.

వరాలును చుట్టేసిన్న తన చేతులను చివాల్న వెనక్కు లాక్కున్నాడు రంగయ్య.

బరువుగా అడుగులువేస్తూ వెళ్లి మంచంమీద వాలిపోయి రెండు చేతుల్లోను ముఖం దాచుకున్నాడు.

ఆ హఠాత్ పరిణామానికి ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో రంగయ్యవైపు చూస్తూ ఉండిపోయింది వరాలు మనస్సు మటుకు ఏవేవో ఊహిస్తూ, ప్రశ్నిస్తూ ఉంది.

'ఈ లోకం మరీ చెడిపోయింది. మనిషిలో మంచితనం, కనికరం అగుపించకుండా పోయాయి. అమ్మ సావుబతుకుల్లో ఉందని కన్నీళ్లెట్టుకున్నా ఏది రూపాయిలు దొరకలేదు లప్పుగా. ఇక దానడర్మాలేంసేత్తారో? ఇలాంటి రాతిగుండె లోకంలో బతకమని పంపిన ఆ దేవుడు నిజంగా రాతిగుండెవోడే.

సివరకు రంగయ్యమావ ఏం సేత్తాడో? అంతా అతని సెంత సానా డబ్బుందంటారు. అదెట్టో సంపాయిస్తాడంట. అడిగితే ఇయ్యకపోతాడా' అనుకుని వచ్చింది.

తను డబ్బు అడిగితే వాడేమ దుగుతాడో తనకు తెల్దా?

అన్నీ తెలిసే, తెగించి వచ్చింది. తనకు తోడునీడగా ఉన్న అమ్మ బతికితే సాలు. అంతే...

వాడు డబ్బిచ్చిందాకా తను ఈణ్ణుండి కదల్దు.

తన ఊహల్లో తను తేలిపోతూ గడపదగ్గిర కూలబడింది వరాలు.

వరాలు అన్న మాటలకు హృదయంలో ఏనాడో

వాచస్పతి

గుచ్చుకొన్న ముల్లు కదిలించినట్లు విలవిలలాడిపోయాడు రంగయ్య.

మనస్సు గతాన్ని తవ్వుకుంటూ పోయింది. గత మంతా కఠిన కంటక మయమే. అందులో ఒకచోట మరీ ముళ్లకంప. ఆ ముళ్లకంప దగ్గిర నడిచి వచ్చి నప్పుడే హృదయం రక్తసిక్తమై పోయింది. గతం తాలూకు విషయాలను జీవిత గ్రంథం నుండి పూర్తిగా తొలగించి వెయ్యాలని తీర్మానించుకున్న క్షణాలు లెక్క లేనన్ని. చాలామటుకు తన తీర్మానాన్ని అమల్లో పెట్టాడు కూడా.

కానీ, ఈ రోజా తిరిగి వరాలు ఆ బాధాకరమైన గతాన్ని గుర్తుకు తెస్తూంది.

దారిద్ర్యం అతి నికృష్టమైంది.

దాని ఛాయ పడినా చాలు, జీవితం దుర్భరమై పోతుంది. అందుకు తమ కుటుంబమే సాక్ష్యం. జీవన యానంలో కొన్ని మలుపులు పూర్తిగా గమ్యాన్నే మార్చి వేస్తాయి. అలాంటిదే తన జీవితంలోని ఒక మలుపు. ఒక సంఘటన.

ఆ రోజు తన జీవితంలో మరిచిపోలేని రోజు. జైలునుండి విడుదల అయ్యాడు. తను చెయ్యని దొంగ తనానికి తను శిక్షించబడ్డాడు. న్యాయశాస్త్రానికి కళ్ళు లేవు. దానికి కంఠం మటుకే ఉంది. బయట ప్రపంచంలోకి అడుగుపెట్టగానే మనస్సు ఇంటివేపు పరుగులు తీసింది.

గుండెజబ్బుతో బాధపడుతున్న ముసలి తల్లి, అవివాహితురాలయిన అక్క ఇంటి దగ్గిర ఏమి అవస్థలు పడుతున్నారో అన్న ఆందోళనతో గబగబా ఇంటివేపు నడిచాడు.

జీర్ణావస్థలో ఉన్న ఆ కుటీరంలో అడుగు పెట్టే సరికి నీరవ నిశ్శబ్దత పరిపాలన చేస్తూంది.

తన మనస్సు ఎందుకో అవ్యక్తమైన భయాలతో నిండిపోయింది.

మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వెళ్ళాడు. అమ్మగానీ, అక్కగానీ కనిపించలేదు. పరిపరి విధాల పోతున్న మనస్సుకు పగ్గంవేసి పాడుబడిన పెరటి వేపు నడిచాడు. అక్క శోకానికి ప్రతిరూపంలా కూర్చుని ఉంది.

"అక్కా!" వణుకుతున్న గొంతుతో పిలిచాడు. అక్క తలఎత్తి చూసి, "వచ్చావా?" అంది. కంఠం నిండా బరువూ, బాధా.

"అమ్మేదీ?"

అక్క మౌనంగా తన ముఖంలోకి చూసింది. తన మనస్సు కీడు శంకించసాగింది.

"మాట్లాడవేం?"

"అమ్మ ఇక లేదు, రంగా!" వెలవెలపోతు చూస్తూ విచలిత స్వరంతో అంది.

తను చైతన్యరహితంగా అలాగే నిలుచుండిపోయాడు కాస్సేపు.

అక్క ఎక్కిళ్లు తిరిగి తనను ఈ లోకంలోకి తెచ్చాయి.

"ఎప్పుడు?" తన కళ్లలో నీళ్లు రాలుతున్నాయి.

"నిన్న...నీకోసం చూచి...చూచి..." తరవాత చెప్ప లేక పోయింది. గొంతు గాద్గద్యం వహించింది.

"గుండె జబ్బు ఎక్కువైందా?"

హృదయాన్ని వ్రయ్యలు చేస్తున్న ఆ మాటలు ఇక వినలేక మధ్యలోనే తుంచివేసి అన్నాడు.

"ఊఁ..."

"మందు ఇప్పించలేదా?" ఆ మాట అని నాలుక కొరుక్కున్నాడు. ఎందుకంటే, దారిద్ర్యదేవత ఆ ఇంట్లో ఏ రూపంలో తాండవిస్తూందో తనకు తెలుసు. కడుపు నిండా తిండికే నోచుకోలేని వారికి మందులెలా వస్తాయి?

అక్క తన ముఖంలోకి ఒదో రకంగా చూస్తూ, "మందిప్పించాను. కానీ..." అని దోసిట్లో ముఖం దాచుకుని రోదించసాగింది.

అక్క నెలా ఓదార్చాలో తన కర్థం కాలేదు. అలాగే నేలమీద కూలబడిపోయాడు.

ఆలోచనలన్నీ అమ్మచుట్టూ మళ్లాయి. అమ్మ జీవితానికి ఇచ్చే నిర్వచనం, కష్టాల కూడలి. ఆమెకు మిగిలిందల్లా కన్నీరు.

ఆ కన్నీటికి విలువే లేదు ఈ లోకంలో. ఈ రోజు అనుకుంటే, ఈ ప్రపంచంలో అమ్మంత నికృష్టజీవి మరొకరు లేరేమో అనిపిస్తుంది. ఆమె ఏ ఆశతో అన్ని రోజులయినా ఈ ప్రపంచంలో జీవించిందో ఒక్కొ సారి అనుకుంటే తనకు ఎక్కడలేని ఆశ్చర్యమూ కలుగుతుంది.

జీవితాన్ని పంచుకుని జీవన సర్వస్వమూ అయిన నాన్న ఆమెను ఒంటరిగాచేసి తనదారి తాను చూసుకుని వెళ్లిపోయాడు.

పెళ్లి చేసుకుని భర్త పిల్లలతో సంతోషంగా ఉండవలసిన అక్కే తన కళ్లముందు జీవచ్ఛవంలా తిరుగుతూంది. గొప్ప చదువులు చదివి, పెద్ద పదవులు పొంది తనను సుఖాల డోలికల్లో ఊగిస్తాడనుకున్న కొడుకు దేనికీ పనికిరాకుండా, బాధ్యతలే మరిచి వీధుల వెంట తిరుగుతున్నాడు. జీవితంలో ఇక ఏమి చూసుకుని సంతోషించగలదు?

అయితే, అమ్మ బొత్తిగా అంత నిరాశావాదిని కాదు.

"అదృశ్యంగా ఉన్న భవిష్యత్తు ఏ అదృష్టాన్ని తెస్తుందో ఎవరికి తెలుసు?" అనేది.

"ధనవంతుడూ, విద్యావంతుడూ, గుణవంతుడూ అయిన యువకుడు అకస్మాత్తుగా ఒక రోజు ఆకాశం నుండి ఊడిపడి, నా కూతుర్ని పెళ్లి చేసుకుని పుష్పక విమానంలో ఎక్కించుకుని పోవచ్చు!" అన్న భావాన్ని వెల్లడించేది.

ఆ ఆశ చాలు అమ్మ జీవించేందుకు.

ఏ జమీందారో తన కొడుకును దత్తత తీసుకోనూ వచ్చు! ఏదైనా జరగవచ్చు. అదృష్టదేవత దయతలిస్తే ఏది జరగకూడదు?

కానీ, బాధాకరమైన గతాన్ని—దుఃఖమయమైన వర్తమానాన్ని—మరిపించి, మురిపించిన ఆ బంగారు భవిష్యత్తు అమ్మ జీవితంలో అడుగుపెట్టనే లేదు!

అందమూ, చదువూ, డబ్బూ ఏమీ లేని అక్కను పెళ్లి చేసుకోవడానికి అమ్మ కలలు కన్నట్లు, ఏ రాజకుమారుడూ రాలేదు. తనను ఎవరూ దత్తతా తీసుకో లేదు.

అంత దుఃఖంలోనూ తనకు ఓదార్పు కలిగించిన భావం, ఆ నికృష్ట దారిద్ర్యంలోనుండి అమ్మ వెళ్లి



రాధా మాధవులు

చిత్రం—ఎస్. సత్యనారాయణ (విజయనగరం-2)

పోవడం. శరీర కష్టం నుండి విముక్తురాలు కావడం.

తనకోసం, అక్కకోసం ఆమె ఇద్దరి ఇళ్లలో వంట పని చేసేది.

ఈ రోజు అనుకుంటే గుండె వ్రయ్యలౌతుంది. కానీ, ఆ రోజుల్లో తన వైఖరి ఎంత నిర్లక్ష్యంగా ఉండేది! ఎంత బాధ్యతారహితంగా ప్రవర్తించేవాడు!

అమ్మ బతికి ఉండగా తనకోసం కన్నీరు కార్చని రోజంటూ లేదు. తను చెప్పినపెట్టింది తిని వీధులు తిరక్కుండా ఇంట్లో బుద్ధిగా ఉండమని ప్రాధేయపడేది. కానీ, ఆ ఇల్లు... దాన్ని చూస్తేనే పరిగెత్తిపోవాలనిపించేది. ఆనందకరమూ, ఆరోగ్య దాయకమూ అయిన వాతావరణం కాదది. ఏదో అసంతృప్తితో తన మనస్సు ఎప్పుడూ బాధపడుతూ ఉండేది. తను జైలుకు వెళ్లకుంటే అమ్మను బతికించుకొని ఉండేవాడేమో? ఏమో?...? ఎలాగయితే ఏం? అమ్మ బరువులకూ బాధలకూ దూరంగా వెళ్లిపోయింది. అక్కా తనూ ఒకరి కొకరు మిగిలారు. అక్కవేపు చూశాడు. అలాగే ఏడుస్తూంది. వ్యథాభారంతో తన మనస్సు కుంగిపోయింది.

"నేను నిజంగా దురదృష్టవంతుణ్ణి. అమ్మ కడసారి చూపు దక్కనేలేదు."

"మనంత దురదృష్టవంతులు ఈ ప్రపంచంలో మరొకరు లేరు, రంగా!" అని భోరున ఏడవసాగింది.

"ఏడవకు. ఏడ్చి లాభమేముంది?" కన్నీరు తుడుచుకుంటూ అన్నాడు.

ఏదీ పట్టించుకోక గాలిపటంలా తిరిగిన తను ఆ నాటికి తన వారి దుఃఖంలో పాలు పంచుకోగలిగాడు.

"ఏడ్చి లాభం లేదని తెలుసు. కానీ, ఏడవకుంటే ఈ హృదయం పగిలిపోతుంది. మరణమే ఈ దుఃఖానికి ఓదార్పు" అంది కన్నీరు తుడుచుకుంటూ.

తను నిశ్చేష్టుడై పోయాడు. అక్కనెలా ఓదార్చాలో తెలియలేదు. మనస్సు వికలమై పోయింది. కాస్సేపటికి తన బాధ్యత గుర్తించి, ధైర్యాన్ని కూడదీసుకుని, "ఏమిటి, అక్కా, నీ పిచ్చి? పోయిన వాళ్లతో మనమూ పోతామా? ఊరుకో. అమ్మ లేని లోటు తెలియకుండా నిన్ను నేను చూచుకుంటాను" అన్నాడు.

ఆ మాటలు అన్నాక అంత దుఃఖంలోనూ ఏదో

# మనిషి

తృప్తి కలిగింది. బహుశా తనవారి బరువు బాధ్యతలను తనపైన వేసుకోబోతున్నానన్న భావనే ఆ తృప్తికి కారణం కాబోలు.

స్వార్థం సుఖాన్ని మటుకే ఇస్తుంది. కానీ, నిస్వార్థం సంతోషాన్ని ఇస్తుంది. అయితే ఆ సత్యాన్ని మానవుడు ఎప్పుడో కానీ గుర్తించలేడు. అదే జీవితంలోని విషాద మేమో?

"నీ కంత కష్టం అవసరం లేదు, రంగా! ఇక బతకాలన్న ఆశ నాకు లేదు." విరక్త కంఠంతో అంది.

"అలాగనకు, అక్కా! ఇన్నాళ్ళూ అమ్మను కష్టపెట్టిన మాట నిజమే. అయితే, అమ్మ ఉన్నప్పుడే నా తప్పు తెలుసుకోలేకపోయాను. మిమ్మల్ని కష్టపెట్టినందుకే భగవంతుడు నన్ను శిక్షించాడేమో? లేకుంటే చెయ్యని నేరానికినేనెందుకు శిక్షించబడతాను? దొంగవన్న పేరుతో మన కుటుంబానికే అప్రతిష్ఠ తెచ్చాను. ఇక మునపటి నా ప్రవర్తన మానుకుంటాను. బాధ్యతలు గుర్తించి నడుచుకుంటాను. నువ్వూ నన్ను ఒంటరిగాచేసి వెళితే నేనేమైపోవాలి? ఇక ఎవర్ని కోసం నేను బతకాలి? ఎవరికోసం మంచిగా ఉండాలి?" బాధాతప్త కంఠంతో అన్నాడు.

"నీకు తెలీదు, రంగా!"

తను ఎంతో ధైర్యం చెప్పాడు. అప్పటికి అక్కే మౌనంగా ఉండిపోయింది, కానీ ఆ రాత్రే అక్క ఈ లోకాన్ని వదలిపెట్టి వెళ్ళిపోయింది, ఓ చిన్న ఉత్తరం వ్రాసిపెట్టి. ఆ ఉత్తరంలోని ప్రతిఅక్షరంతనకిరోజుకూ బాగా గుర్తుంది. అక్కే కళ్ళముందు నిలుచుని చెబుతున్నట్లే ఉంటుంది.

"రంగా,

నేనూ అమ్మదగ్గరకే వెళుతున్నాను. ఒంటరివైపోయానని దిగులుపడకు. బ్రతికి ఉన్నంతవరకే ఈ బంధనాలన్నీ. అమ్మ అంత త్వరగా చనిపోవడానికికారణం నీ కంటగట్టబడిన నిందే. నీవు దొంగవన్న భావనే ఆమె భరించలేకపోయింది. ఇందులోని నిజానిజాలు ఆ సర్వసాక్షికే తెలియాలి.

ఇక నా విషయం. నా జీవితాని కసలు అర్థంలేదు. ఈ ప్రపంచంలో నా పోరాటం వ్యర్థం. నా బతుకు కలుషితమైంది. అమ్మ జబ్బు ఎక్కువైంది. ఆమెను బతికించుకోవాలంటే డాక్టరు రాసి ఇచ్చిన మందులు కొన్ని గంటల్లో కొనాలి. కానీ, డబ్బు? ఈ ప్రపంచంలో ఈ పేదరాలి హృదయావేదన అర్థంచేసుకుని ఆదుకొనేవారు ఎవ్వరూ లేరు. ప్రపంచమంతా వ్యాపారమయమే. బదులుకు బదులు. నే నివ్వగలిగిందేమిటో నీకీపాటికే తెలిసే ఉంటుంది. కానీ, ఎవరి కొరకైతేజీవితంలోని అమూల్యమైన వస్తువును కూడా తృణప్రాయంగా చూచానో ఆమె బతకనేలేదు. నేను ఇచ్చి సాధించే దేమీ లేదన్నావు. బతికి మటుకు సాధించే దేముంది?

ఎక్కడున్నా నీ మేలు కోరే,
నీ అక్క
వరలక్ష్మి."

దానితో జీవితం శూన్యమనిపించింది. అమ్మా అక్కా కూడా తన నిజాయితీ శంకించారు. ఇక లోకం తనను ఎలా నమ్ముతుంది? అప్పుడప్పుడే బాధ్యతలను గుర్తిస్తున్న మేధా, మమతలను నింపుకుంటున్న మనస్సూ తిరిగి పూర్వపు స్థితికి వెళ్ళిపోయాయి. సంఘం తనకూ, తనవారికీ తీరని ద్రోహం చేసిందన్న పిచ్చి ఆవేశం కలిగింది. దానితోబాటు సంఘం మీదే తిరగబడడం జరిగింది.

ఒకప్పటి 'రంగా', 'రంగారావు' లాంటిపేర్లు ఈ రోజు తనకు లేవు.

'రంగయ్య మామా', 'రౌడీ రంగడు', 'పూలరంగడు' ఇత్యాదిపేర్లు సార్థకం అయ్యాయి.

ఆ రోజు అక్కకు జరిగిన అన్యాయమే ఈ రోజు వరాలకు జరగబోతూంది. అదీ, తనచేత...

"రంగయ్య మావా! ఏవి టాలోచిస్తున్నావు? అమ్మ సావుబతుకుల్లో ఉంది. డబ్బియ్యి. నీ ఋణం జనమ జనమకీ గుర్తుంచుకుంటా." కళ్ళు ఒత్తుకుంటూ అంది వరాలు.

అశ్రుసిక్త నయనాలతుండా వరాలు వేపు చూశాడు రంగయ్య.

వరాలులో కనిపించింది అక్క వరలక్ష్మి. వరాలు కన్నుల్లోనుండి మూగగా చెబుతూంది, తనకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగరాదని.

రంగయ్య మెల్లిగా లేచాడు. పెట్టె తెరిచి అడుగున పడిఉన్న పది రూపాయల కాగితాలు పది తీశాడు. వరాలు చేతిలో పెడుతూ, "త్వరగా వెళ్ళు" అన్నాడు. వరాలు డబ్బు జాగ్రత్తగా పెట్టుకుంటూ, "రేపొస్తా మావా!" అని వెనక్కు తిరిగింది.

"వరాలూ!"

వరాలు వెనక్కు తిరిగి ఏమిటన్నట్లు చూచింది.

"ఈ డబ్బు నాకు తిరిగి ఇవ్వక్కర్లేదు. నువ్వు నా దగ్గరకు రానూ అక్కర్లేదు. నా దగ్గరకేకాదు, ఈ దరిదాపులకే రాకు. నేను డబ్బిచ్చినట్లు ఎవ్వరికీ చెప్పకు. త్వరగా వెళ్ళి నీ అమ్మకు మందులు కొను." విచలిత స్వరంతో అన్నాడు.

వరాలు ఆశ్చర్యంతో చిత్తరువే అయింది! కొన్ని క్షణాల తరువాత తేరుకొని, "నువ్వెంత మంచోడివి మావా! అంతా నిన్ను పెడ్డోడంటారేం?" అంది.

"నేను పెడ్డోణ్ణే, వరాలూ! నిద్రపోతున్న నాలోని మానవత్వాన్ని తిరిగి నువ్వు మేలుకొల్పావు. తిరిగి అది నిద్రపోకుండా చూచుకోవడమే నా పని" అన్నాడు.

"ఏంటో నీ మాటలు నా కర్థం కావటం లేదు. అయితే, అందరూ అనుకుంటున్నట్టు నువ్వుపెడ్డోడివి కాదు మావా! నీ ఋణం ఏ జనమలోనైనా తీర్చుకుంటాలే మావా!" అని లేడిపిల్లలా పరిగెత్తిపోతున్న వరాలును చూస్తూ నిలుచుండిపోయాడు రంగయ్య. ★



సాగరతీరం

చిత్రం—ఆర్. రాధాకృష్ణ (హూస్పెట.2)